


కాలేజీల్లో ప్రొఫెసర్లుగానూ, లెక్చరర్లుగానూ పని చేస్తున్న ఆరుగురు స్నేహితురాళ్లకి ఎన్నికలు వస్తున్నాయంటే గుండెల్లో గుబులు బయలుదేరింది. వాళ్లకే కాకుండా గవర్నమెంటు ఆఫీసుల్లో పని చేస్తున్నవాళ్లందరికీ కూడా అదే పరిస్థితి! ఏ మారుమూల పల్లెటూళ్లకో, ఏజెన్సీ ప్రాంతాలకో, నక్సలైట్లున్న ఏరియాలకో వేసేస్తారేమో అని.

ఇదివరకు ఎన్నికల ఆఫీసరుగా పని చెయ్యటానికి ఒప్పుకుని వెళ్లటమే గొప్పగా భావించి, అందరికీ చెప్పుకునేవారు. ఇప్పుడు పరిస్థితులు మారి, కొట్లాటలూ, లాఠీ చార్జీలూ, వగైరాలన్నీ జరుగుతున్నందువల్ల, ఏం జరుగుతుందో అనే భయం ఎక్కువైంది.

ఈ స్నేహితురాళ్లకి ఎలక్షన్ డ్యూటీకి వెళ్లక తప్పేలా లేదు. అందువల్ల వాళ్లు పై ఆఫీసరు దగ్గరకు వెళ్లి, తమకు చిన్న పిల్లలున్నారనీ, దూరప్రాంతాలకు వెయ్యకుండా సిటీలోనే వెయ్యమనీ వేడుతూ వినతిపత్రాన్ని సమర్పించారు. వారి హృదయా వేదనకు స్పందించిన అధికారులు, ''సరేలెండమ్మా, ఈ చుట్టు పక్కల ప్రాంతాల్లోనే వేస్తాం'' అంటూ అభయహస్తమిచ్చి పంపించారు.

పోలింగు ముందు రోజు ఆఫీసుకు రమ్మని, బాలెట్ పేపర్లూ, మిషన్లూ, వగైరాలు ఇచ్చి, భద్రతాదళాల సహాయంతో వారి వాహనంలోనే వాళ్లని ఒక ప్రదేశానికి చేర్చారు. సిటీలోనే కదా అని వాళ్లు సంబరపడుతూ ఉంటే, ఆ వాహనదారు, కారుని సందులూ, గొందులూ తిప్పుతూ, హేమావతీ కాలనీకి తీసుకు వచ్చి అక్కడి కమ్యూనిటీ హాలు దగ్గర దించాడు.

అదొక పేదల బస్తీ. చాలా చిన్న హాలు. దానికి బాత్ రూములూ, వగైరా సదుపాయాలేం లేవు. ఆ పరిసరాలు పరికించి చూసేసరికి, వాళ్ల సంతోషం కాస్తా అటకెక్కి కూర్చుంది. ఆ గల్లీలూ, గుడ్డి వెలుతురు దీపాలూ, సైడు కాలవల్లోని వాసనా... చూసి భీతి చెందారు.

దానికి తోడు ఆ బస్తీ ప్రెసిడెంటూ, పెద్దలూ, చుట్టుపక్కల ఉన్న ఆడవాళ్లూ కలసి, ''పోలింగుకు ఆడకూతుళ్లు ఆఫీసర్లుగా వచ్చా''రంటూ, వీళ్లని పలకరించి వెళ్లారు.

గుబురు మీసాలతో జబర్దస్తీగా ఉన్న ఆ మగవాళ్లనీ, కుర్రకారునీ చూస్తే భయమేసింది. వీళ్లేమో, ''ఆఫీసర్లం కదా కాస్త హుందాగా ఉండాలి'' అనుకుని, బంగారు గాజులూ, మెడలో గొలుసులూ, అవీ ధరించి వచ్చారు.

ఆ వచ్చిన స్త్రీలలో ఒకామె, గీత దగ్గరకు వచ్చి, చెయ్యి పట్టుకుని, ''మీ చేతి గాజులు చాలా బాగుండాయి. ఎన్ని సవర్లయింది? ఎంత ఖర్చయింది?'' అని అడిగింది.

''ఈ హాలుకు బాత్ రూములు లేవు. మా ఇళ్లకొచ్చి తానాలు కానిచ్చుకోండి. మళ్లీ పొద్దోతే మేము తాళాలేసేసుకుంటాము. అసలే దొంగల భయం ఎక్కువగా ఉంది'' అని చెప్పి వెళ్లారా ఆడంగులు.

సరే అని వెళ్లి, ఆ రేకు తలుపుల శబ్దాలకు విస్తుపోతూ, అక్కడి వాసనలు భరించలేక, స్నానం మాట మూట కట్టేసి, తమ అవసరాలు తీర్చుకువచ్చారు.

ఇంతలో బస్తీ ప్రెసిడెంటు, నలుగురు కుర్రాళ్లని తీసుకుని తనకు తెలిసున్నవాళ్ల ఇళ్లలోని నాలుగు పరుపులూ, దిండ్లూ పట్టుకువచ్చి, హాలులో వాళ్లకి పడకలకు ఏర్పాటు చేశాడు. కూజా లతో నీళ్లు పెట్టించి, తలుపులు జాగ్రత్తగా వేసుకుని పడుకోమని చెప్పి వెళ్లాడు.

''సుప్రజా! మనమేదో ఆఫీసర్లం కదా అని, హుందాగా ఉండటం కోసం బంగారు నగలు తెచ్చుకున్నాం. వీళ్లని చూస్తే తెల్లారేసరికి మన మెళ్లో పుస్తెల తాడైనా మిగులుతుందో, లేదో అనిపిస్తోంది. మనం ఇంటికి వెళ్లాక మంచి రోజు చూసుకుని మన భర్తల చేత సూత్రధారణ చేయించుకోవాలేమో? అంత వరకూ పసుపు కొమ్మే గతి!'' అంది గీత, భయపడుతూ.

''నువ్వు చెప్పినట్లే ఉందే గీతా! వాళ్లు మన బంగారం విలువా, ఇంటి అడ్రసూ కూడా అడిగారు. ఈ రోజు కాకపోయినా, ఏదో ఒక రోజు వచ్చి తస్కరించుకుపోతే, మళ్లీ మనం పెళ్లి కూతుళ్లలా కాకపోయినా, షష్టిపూర్తి ముసలమ్మల్లా మెడ వంచి తాళి కట్టించుకోవాల్సి వస్తుంది. బంగారం రేటు పెరిగింది కదా... ఆ మూడు ముళ్లూ పడేసరికి అలా అవుతామేమో!'' అంది సుప్రజ.

''పోనీ ఒక పని చేద్దామా? ఇవన్నీ తీసి పరుపు కింద దాచుకుందామా...?'' అని అడిగింది పద్మజ.

''సరేలే. అసలే ఈ పరుపులన్నీ ఎలకలు కొట్టేసి చిల్లులు పడి ఉన్నాయి. ఇవి కాస్తా ఆ చిల్లుల్లోపలికంటా వెళ్లాయంటే, మనం

రాత్రంతా నిద్ర మాని పరుపులన్నీ పీక్కుంటూ కూర్చోవాలి. అయినా మనకి బయట భద్రతాదళ సిబ్బంది ఉందిగా భయం లేదు లెండి. ముందు టిఫిను తిందాం, ఆకలేస్తోంది" అంది హర్షిత.

తినటం అయ్యాక, పడుకుందామని పక్కల కేసి చూశారు. జిడ్డుతో అట్టలు కట్టిన దిండ్లూ, ముక్క వాసన వస్తున్న పరుపులూ చూసి, "తప్పదురా భగవంతుడా!" అనుకుని, కాస్త పెర్ఫ్యూమ్ జల్లుకుని, దుప్పట్లు పరుచుకుని పడు కున్నారు.

ఒకటే ఉక్కపోత. కిటికీలు తీసుకుందామంటే దోమలూ, దొంగల బెడద. ఫేన్ ఆన్ చేసుకున్నారు. అది కాస్తా దడదడా శబ్దం చేస్తూ తిరగటం మొదలు పెట్టింది.

"అసలే వైర్లు లూజుగా ఉన్నాయి. తెగి కింద పడితే మన కాళ్లూ, చేతులూ రేపు పోలింగు పనికి సహకరించవు!" అనుకుంటూ దాన్ని కట్టేశారు.

ఇంటికి ఫోను చేసి, "సిటీలోనే కదాఅని వస్తే, సందులన్నీ తిప్పి మమ్మల్నొక బస్తీకి తీసుకువచ్చారు. ఇక్కడ ఏ సౌకర్యమూ లేదు. వాళ్ల ఇళ్లలో వండినవి మేము తిన లేమేమో అని, పండ్లూ, పాలూ ఇచ్చారు. ఇంటి దగ్గర నుండి తెచ్చుకున్నవాటితో కడుపు నింపుకున్నాం. మాకు భయంగా ఉంది. ఈ బస్తీ ఏ మారుమూల ఉందో కూడా అర్థం కావటల్లేదు" అంటూ అన్నీ వివరించి చెప్పి, ఇంట్లోవాళ్లని భయ పెట్టేశారు.

"అయ్యో, అలాగా! ఇప్పుడు మేము ఏం చెయ్యాలి? రేపు పొద్దున్నే ఎలాగోలా వెతుక్కుంటూ వస్తాం. మీరు ధైర్యంగా ఆంజనేయస్వామి దండకం చదువుకుంటూ పడుకోండి" అని వాళ్ళకి ధైర్యం చెప్పారు, వాళ్ల వాళ్లు.

కానీ వాళ్లకి వీళ్లు చెప్పిన వివరాలు విన్నాక భయం వేసి, టీవీ సీరియల్స్ చూడటం మానేసి, దైవమందిరాల్లో కూర్చుని ప్రార్థనలు చేస్తూ, అక్కడ ఓటర్ల అల్లర్లూ, పోలీసుల లాఠీ చార్జీలూ జరగ కుండా పోలింగ్ ప్రశాంతంగా జరిగి, తిరిగి పిల్లలు ఇంటికి క్షేమంగా చేరాలంటూ, రకరకాల మొక్కులు మొక్కుతూ, ఆ రాత్రంతా జాగారం చేశారు. ఆ రోజు ఏకాదశి అయినందున అదృష్టం కొద్దీ దైవప్రార్థనల వల్ల కొంచెం పుణ్యం సంపా దించారు.

తెల్లవారాక లేచి, బాత్ రూములు సరిగా లేనందున స్నానం మానేసి, ముఖ ప్రక్షాళనం కావించుకుని, మొహాలకి కాస్త రంగులు పులుముకుని, సెంట్లు రాసుకుని, హుందాగా తమ సీట్లలో కూర్చున్నారు. బస్తీ వాళ్లు తెచ్చిన కాఫీ చూసి, ఇంటి దగ్గర తాగే ఫిల్టరు కాఫీని గుర్తు తెచ్చుకుని, గుటుక్కున మింగేసి, తమ డ్యూటీ మొదలుపెట్టారు. స్త్రీలకు విడిగానూ, మగవాళ్లకు వేరుగానూ రెండు విభాగాలుగా చేసి, లోపలకు వచ్చినవారికి వేలిపై సిరా చుక్క పెట్టి లిస్టులో పేరూ, వాళ్ల ఫొటో ఉన్న కార్డూ, అన్నీ ఉన్నాయో, లేదో చూస్తూ, ఓటు హక్కు వినియోగించేలా చూసుకుని, పంపిస్తున్నారు.

ఓటు వేసి బయటకు వచ్చిన మహిళల్లో ఒకావిడ, "ఏం ఉద్యోగాలో ఏంటో! పెద్ద బంగళాలలో ఉండేటోళ్లని మన బస్తీకి పంపించారు. మన బాత్ రూములు నచ్చక, ఆడ కూతుళ్లు తానం చెయ్యటం మానేసి, మొకానికింత పౌడరు పులుముకుని కూ కున్నరు. ఏసం కాలం గందా, ఆళ్ల దగ్గర కెడితే ఒకటే చెమటోసన! మనమైతే ఒక్క నిమిషం ముక్కు మూసుకుని ఓటేసేసి వచ్చేసాం. ఆళ్లు రాత్రి ఇంటికెళ్లేదాకా, మన కంపుతో పాటు ఆళ్ల వాసన కూడా భరించాలి. ఏం ఉద్యోగాలో ఏంటో!" అంటూ, నోట్లో ఉన్న జరదా తుపుక్కున ఉమ్మింది, రోడ్డు పక్కన.

"అరే నా ఇంటి కాడ ఊస్తావేందే? మా గల్లీ బాగోలేదు. ఈ పాలన్నా డెయినేజీలు ఏత్తారో లేదో? అయినా ఓటెయ్యటానికి డబ్బులుచ్చుకున్నాం గందా. ఇకేమేత్తార్లే" అనుకుంటూ ఇళ్లకెళ్లారు.

"పొద్దుట కాఫీ ఇస్తే మొహాలు చిట్లించు కుని తాగారు. ఇంక భోజనం తెస్తే తింటారో లేదో? అయినా వాళ్లకి గవర్నమెంటోళ్లు డబ్బులిస్తారుగా. వాళ్లే ఏదో ఒకటి తెప్పించుకు తింటారు. మనడబ్బులు ఖర్చు చేసుకోవటమెందుకు?" అని ఇరువర్గాల వాళ్లూ సంప్రదించుకుని మాట్లాడక ఊరుకున్నారు.

కడుపులో కాలుతుంటే, బయటకు వెళ్లకూడదు కాబట్టి ఆ బస్తీలో ఎటువంటి పదార్థాలు తినాల్సివస్తుందో-అని భయపడి, అరటిపళ్లతో కడుపు నింపుకు న్నారీ నారీమణులు. వాళ్లు భయపడినట్లుగా కాకుండా, మంచి మనసు గల ఆ బస్తీ పెద్దలు, పార్టీలు వేరైనా ఐకమత్యంగా ఉండి, కొట్లాటలూ, లాఠీ చార్జీలూ, ఏవీ లేకుండా పోలింగు కార్యక్రమం ప్రశాంతంగా కానిచ్చారు.

బస్తీవాళ్ల మంచితనానికీ, కొట్లాటలు జరగనందుకూ, తమ అదృష్టానికి ఆనందిస్తూ తిరిగి పోలీసుల సాయంతో ప్రభుత్వాధికారుల దగ్గరకు వెళ్లి, తమకిచ్చిన బాధ్యతాపరికరాలన్నీ సమర్పించి, అర్ధరాత్రికి ఇంటికి చేరుకున్నారు.

అంత సేపూ తమ వాళ్ల కోసం దైవ ప్రార్థనలు చేస్తున్నవాళ్లకి, వీళ్లని చూసేసరికి ప్రాణం లేచి వచ్చి, అక్కున చేర్చుకుని ఆప్యాయంగా కొసరి కొసరి తినిపించి హాయిగా నిద్రపోయారు, ముక్కోటి దేముళ్ల మాటా మరిచిపోయి.

వాళ్లు అలా నిద్రపోయేసరికి, ఆ దేముళ్లంతా ఒక దగ్గరికి చేరారు. "రాత్రంతా మనని నిద్ర పోనివ్వకుండా, భజనలతో, స్తోత్రాలతో పొగిడి, పలురకాల మొక్కులు మొక్కారు. వాళ్ల వాళ్లు కనిపించగానే మనను మరిచిపోయి హాయిగా నిద్ర పోతున్నారు. మనకింక నిద్ర పోవటానికి లేదు. మిగిలిన ప్రజలంతా దేవాలయాల్లో సుప్రభాతాలు పాడేస్తున్నారు. ఏం మనుషులో ఏమిటో? ఇంతకీ వీళ్లు, మనకి మొక్కిన మొక్కులు తీరుస్తారా? లేక రాజకీయనాయకుల్లా చేసిన వాగ్దానాలను మళ్లీ ఎన్నికలు వచ్చాక గుర్తు తెచ్చుకుంటారా? ఈ కాలం మనుషుల్లో స్వార్థం ఎక్కువైపోయింది" అనుకుంటూ, వాళ్లు తీర్చబోయే మొక్కుబడుల కోసం ఎదురు చూడసాగారు ముక్కోటి దేవుళ్లూనూ.

●

**(27వ పేజీ తరువాయి)** కాగా, పూర్ణచంద్ జీవనదృక్పథం లోని తాత్త్విక కోణాన్ని ఆవిష్కరించే రచనలు- 'రామాయణంలో విశేషాలు', 'గీతగోవిందం', 'బుద్ధదేవుని కథ' వంటివి ఉన్నాయి. వీటన్నిటా అతని వైజ్ఞానిక అనుశీలన కనిపిస్తుంది. ఐతిహాసిక కోణం నుంచీ విడివడిన చారిత్రక అనుసరణ గోచరిస్తుంది. ఒక తార్కిక జిజ్ఞాసద్యోతమవుతుంది. ఉదాహరణకి 'రామాయణ విశేషాలు'లో 'కైకేయివన్నీ తల్లిపోలికలే' 'రావణుడికి ఉత్తరం రాసిన లక్ష్మణుడు' వంటి అంశాలు ఆలోచనీయంగా ఉన్నాయి.

గ్రంథరచనలో పూర్ణచంద్ శైలి గురించి ఒక్క మాట చెప్పాలి. ఎంతటి శాస్త్ర సాంకేతిక వైజ్ఞానికాంశాలనయినా, చాలా సరళంగా, సులువుగా, స్పష్టంగా చెప్పగలనేర్పు ఉందతనికి. శ్రోతని ఎదురుగా కూర్చోబెట్టుకుని చెప్తున్నట్టు విషయవివరణని సంభాషణాత్మకం చేయగలడు. విషయం మరీ క్లిష్టమైనదైతే పాయింట్స్‌గా విడగొట్టి రాసేస్తాడు. ఉదాహరణకి. మూర్ఛవ్యాధిలో ఆహారవైద్యం 13 పాయింట్స్‌గా ఇస్తే, జ్వరంలో జాగ్రత్తల్ని 12 పాయింట్స్‌గా రాస్తాడు. అలాగే 'రామాయణ రహస్యాలు'లో దాదాపు అన్ని అంశాల్నీ 'డాక్యుమెంటరీ' పద్ధతిలో కథనం చేశారు.

జీవనతాత్త్వికత విషయంలో, రచనాదృక్పథం విషయంలో ఏది ఎంతవరకూ అవసరమో స్పష్టంగా తెలుసుకున్న వ్యక్తిగా దర్శనమిస్తాడు పూర్ణచంద్. సాటి మనిషి మనుగడని ఆరోగ్యవంతమూ, ఆనందదాయకమూ చేయడానికి తానుగా ఏం చేయగలడో, అంతా చేస్తున్న సీరియస్ వైద్యుడూ, ఉత్తమ సాహితీ పరుడూ-పూర్ణచంద్. అతడొక కాంతిదర్శి, చైతన్య పథగామి!! విభిన్న ప్రక్రియల్లో బహుముఖీన ప్రతిభా వ్యుత్పత్తుల్ని వెలారుస్తున్న సాహితీ క్రియాశీలి -డా॥ పూర్ణచంద్‌కి అభినందనలు!

- విహారి